# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్లోవేకియా దేశంలో పర్యటిస్తున్నారు.
- భారతదేశ పురోగతి ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడులను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.
- కేంద్ర మంత్రి వర్గం ఈరోజు న్యూఢిల్లీలో ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమయ్యింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(RBI) రెపో రేటును 0.25 శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.

==============================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్లోవేకియాదేశంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈరోజు ఆ దేశ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినితో సమావేశమై రాష్ట్రపతి పలు అంశాలపై చర్చించారు. ఈ ద్వైపాక్షిక చర్చల్లో MSMEలు, విదేశీ సేవలకు సంభందించిన రెండు అవగాహన ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న మీడియా, సృజనాత్మక ఆర్థిక రంగాలలో సహకరించుకోవడానికి రెండు దేశాలు కలసి ముందుకు వెళతాయని రాష్ట్రపతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

==============================

భారతదేశ పురోగతి ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా మారుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. నవకార్ మహామంత్ర దివస్ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈరోజు పాల్గొని ప్రసంగించారు. జైన సమాజం శతాబ్దాలుగా సరళత, సంయమనం, స్థిరత్వం అనే సూత్రాలు ఆధారంగా జీవిస్తోందని అన్నారు. జైన సాహిత్యం భారతదేశ మేధో వైభవానికి వెన్నెముక అని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ దార్శనికతలో భాగంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, దేశంలో తయారయ్యే వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేయాలని సూచించారు. అభివృద్ధి చెందిన భారతదేశం అంటే అభివృద్ధితో పాటు వారసత్వాన్ని కూడా అందిపుచ్చుకోవడమని ప్రధాని మోదీ పేర్కొంటూ..

(వాయిస్..36 సెకన్లు)-సెట్

==============================

ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన కింద కమాండ్ ఏరియా డెవలప్మెంట్ అండ్ వాటర్ మేనేజ్మెంట్ ఆధునీకరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపిందని, సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. 2025-26 సంవత్సరానికి గాను కమాండ్ ఏరియా అభివృద్ధికి ప్రభుత్వం 1600

కోట్ల రూపాయలను ఖర్చు చేయనుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి - పాకాల - కాట్పాడి మధ్య 1332 కోట్ల రూపాయల వ్యయంతో 104 కిలోమీటర్ల రైల్వే లైన్ డబ్లింగ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. ఒక వెయ్యి 878 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆరు లైన్ల జిరాక్‌పూర్ బైపాస్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడిస్తూ..

(వాయిస్..38 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రం 'భారత్ స్పేస్ స్టేషన్' ను ఏర్పాటు చేయనుందని శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డా.జితేంద్ర సింగ్ తెలిపారు. ఈరోజు రైజింగ్ భారత్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి, భారత అంతరిక్ష భవిష్యత్ ప్రణాళికలపై ప్రసంగించారు. 2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగామి కాలుమోపుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలతో భారత్ వైజ్ఞానిక సత్తాను ప్రపంచానికి చాటిందని డా.జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) రెపో రేటును వరుసగా రెండోసారి సవరించింది. రెపోరేటుపై 0.25 శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో వడ్డీ రేట్లు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గాయి. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈరోజు ముంబయిలో వెల్లడించారు. రెపోరేటు తగ్గింపు నిర్ణయానికి 'మానిటరీ పాలసీ కమిటీ' ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.5 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొంటూ...

(వాయిస్..33 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రత్యక్ష పన్ను వివాద్ సే విశ్వాస్ పథకం కింద పన్ను బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (CBDT) తెలియజేసింది. ఈ నెల 30వ తేదీ లోగా డిక్లరెంట్లు తమ పన్ను బకాయిలను నియమించబడిన అధికారికి దాఖలు చేయవచ్చని CBDT ఒక గెజిట్ నోటిఫికేషన్‌లో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడులను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. లండన్‌లో జరిగిన ఇండియా-యుకె ఇన్వెస్టర్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈరోజు పాల్గొన్న ఆర్థికమంత్రి .. విధాన మద్దతుతో స్థిరమైన ఆర్థిక వృద్ధి పెట్టుబడి అవకాశాలను ప్రారంభించడానికి ప్రభుత్వ ప్రాధాన్యతలను ఈ సందర్భంగా వివరించారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సులభతరం చేయడానికి పాలనాపరమైన సంస్కరణలను అనుసరించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ముఖ్యంగా ప్రస్తావించారు. 2032 నాటికి భారత్ అతిపెద్ద భీమా మార్కెట్ గా మారుతుందని నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ..

(వాయిస్..38 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోషకాహార అవగాహనను ప్రోత్సహించడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పోషన్ పఖ్వాడా 2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మిషన్ పోషన్ 2.0లో భాగంగా ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడంతో పాటు సమాజాల సాధికారతను పెంపొందించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తోంది. గర్భం దాల్చినప్పటి నుండి రెండు సంవత్సరాల వయస్సు వరకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం తెలియజేస్తోంది. శిశువు

జన్మించిన మొదటి వెయ్యి రోజుల వరకూ పోషణపై దృష్టి పెట్టినట్టయితే జీవితకాల ఆరోగ్యానికి అది పునాది అవుతుందనే ఇతివృత్తంతో పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

=============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మాస్కోలో మే 9వ తేదీన జరగబోయే (విక్టరీ డే) పరేడ్ లో పాల్గొనాలని రష్యా ఆహ్వానించింది. ఈ మేరకు ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆండ్రీ రుడెంకో వివరాలు వెల్లడించారు. ఈ వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ సాధించిన విజయానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

=============================

అమెరికా ఉత్పత్తులపై 84శాతం సుంకం విధిస్తున్నామని చైనా ప్రకటించింది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని ఆ దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తమ దేశ వస్తువులపై అమెరికా 104శాతం సుంకం విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అమెరికా బెదిరింపులకు పాల్పడుతోందని, ఆ దేశ నిర్ణయాలతో ప్రపంచ వాణిజ్యం స్థిరత్వాన్ని కోల్పోతుందని చైనా పేర్కొంది.

=============================

వాయువ్య భారతదేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరగుతాయని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది. రానున్న రెండు రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని IMD సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. పంజాబ్, హర్యానా, ఢిల్లీలో కూడా వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన చెప్పారు.

=============================
=============================